సంక్షామ హాస్టళ్లు

- అరకొర వసతులతో అగచాట్లు ● మూలన పడ్డ మరుగుదొడ్లు
- నేలపై నిద్రిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు
- ప్రవేశాలకు విద్యార్థుల అనాసక్తి


రేవుపోలవరంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న బీసీ బాలికల వసతి గృహం


ఎస్.రాయవరం వసతి గృహంలో మూలకు చేరిన మరుగుదొడ్లు

ఎస్.రాయవరం: వసతి గృహాలకు ఆలనాపాలనా కరువైంది. కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మలవిసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ప్రశాంతంగా నిద్రించేందుకు మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. మండలంలో నాలుగు వసతి గృహాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం బాలుర వసతి గృహంలో 30 విద్యార్థులు ఉన్నారు. వీరికి మరుగుదొడ్లు రీడింగ్ రూమ్స్, కిచెన్, డైనింగ్ సదుపాయాలు లేవు. బాత్‌రూమ్‌కి వెళ్లాలంటే పొలాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ వసతి గృహానికి అవసరమైన మైదానం లేదు. ప్రహరీ రక్షణ లేక రాత్రిళ్లు భయం భయంగా గడుపుతున్నారు.

రేవుపోలవరం బాలికల వసతి గృహంలో..

ఇక్కడ 70 మంది విద్యార్థినులు ఉన్నారు. రెండు గదులున్న అద్దె భవనంలో వీరు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేసి పగటిపూట పాఠశాలకు, రాత్రిళ్లు ఇళ్లకు వెళ్లడం ఆనవాయితీగా మారింది. ఎవ్వరూ హాస్టలులో ఉండటం లేదు. ఇది వసతి గృహమా లేదా క్యాంటీనా అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇలాగే కొనసాగించాలని స్థానిక నాయకులు ఒత్తిళ్లు చేయడంతో జిల్లా అధికారులు చోద్యం చూస్తున్నారు. దాంతో పొరుగు గ్రామాల విద్యార్థులు వసతి గృహంలో చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇకనైనా జిల్లా అధికారులు చొరవ చూపి వసతి గృహానికి ఉండాల్సిన హంగులన్నీ ఏర్పాటు చేసి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

లింగరాజుపాలెంలో..

తుఫాన్ రక్షిత భవనంలో మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాలలో రెండు వందలకుపైగా బాలికలు ఉంటున్నారు. ఇక్కడ చదువు, పడక ఒకే గదిలో కావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలకు నాలుగేళ్లుగా సొంత భవనం నిర్మాణం చేపట్టలేదు. సదుపాయాల కల్పన లేదు.

తిమ్మాపురం కేజీబీవీలో..

ఇక్కడ రెండు వందల మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడ నేలపైనే నిద్ర చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం మంచాలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నా ఇంకా ఇవ్వలేదు. చలి, ఎండ తీవ్రవ ఎక్కువగా ఉన్నప్పుడు ఇబ్బందులు పడుతున్నారు.


తిమ్మాపురం కేజీబీవీలో విద్యార్థినులు

ఫిర్యాదు చేస్తే కక్షసాధింపు చర్యలు

ఈ వసతి గృహాలపై ఎవరైనా విద్యార్థులు ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తే, వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇటువంటి ఘటనలు జరగడంతో మిగిలిన వారు భయపడుతున్నారు. తమ కష్టాలను ఎవ్వరికీ చెప్పుకోలేక అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతూ చదువులు నెట్టుకొస్తున్నారు.


ఎస్.రాయవరంలో అసౌకర్యాలతో బీసీ బాలుర వసతి గృహం


లింగరాజుపాలెం పాఠశాలలోని ఒకే గదిలో చదువు, వసతి

క్లుప్తంగా

మోదకొండమ్మ తల్లి గుడికి విరాళం


విరాళం అందజేస్తున్న అప్పారావు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో మోదకొండమ్మ ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకోసం పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన మారిశెట్టి అప్పారావు రూ.5,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కోరారు. మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన విల్లూరి నూక నరసింగరావు నాగేశ్వరరావును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింగరావును శాలువాతో సత్కరించారు. సంఘాన్ని అభివృద్ధి చేయడంతోపాటు రైతులకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు కర్రి సాయికృష్ణ, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి శివ, దాడి భీమునాయుడు, సబ్బి శ్రీనివాసరావు, ఉల్లింగల గోవింద, ఆడారి జానకి తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ మరిచారు..


పాతరోడ్డు జంక్షన్‌లో రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల: ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు జంగిల్ క్లియరెన్సు మాటే మరిచారు. ఏడాదిగా రహదారులను పిచ్చిమొక్కలు కమ్మేశాయి. ఏ పల్లెకు వెళ్లినా రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లతోపాటు గతుకుల రోడ్లలో పిచ్చిమొక్కలు వాలిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాతరోడ్డు, చౌడువాడ, గొట్టివాడ, లింగాపురం-కె.వెంకటాపురం, రాజుపేట, అన్నవరం, నీలిగుంట రహదారుల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పిచ్చిమొక్కల కారణంగా వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ సెక్షన్ పురుషోత్తపురం, యలమంచిలి విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పులపర్తి, పీఎస్‌ఆర్ పేట, బయ్యవరం, లక్కవరం, కృష్ణాపురం, నాయనమ్మపాలెం, రుక్మిణీపురం, జగనన్న కాలనీ, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం వ్యవసాయ కనెక్షన్లు, యలమంచిలి పట్టణం ధర్మవరం వీధి, సైతారుపేట రోడ్డు, యలమంచిలి వై కూడలి నుంచి అచ్యుతాపురం రహదారి వరకు, యలమంచిలి పట్టణం కొత్త ఎర్రవరం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

మొల్లేటి గెడ్డలో ఫార్మా వ్యర్థాలతో ఇక్కట్లు

పరవాడ: భర్నికం సమీపంలోని మొల్లేటి గెడ్డలో నిలిచిపోయిన ఫార్మా రసాయన వ్యర్థజలాలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొల్లేటి గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మొల్లేటి గెడ్డలోకి ఫార్మా రసాయన వ్యర్థ జలాలను విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థ జలాలను పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంబంధిత యాజమాన్యాలకు నోటీసులిచ్చి చేతులు దులిపేసుకున్నారే తప్ప, ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని ఆరోపించారు. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదిలిపెట్టడంతో భూగర్భజలాలు కలుషితం కావడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న పరవాడ, భర్నికం, తానాం, తాడి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, ఈ బోనంగి గ్రామాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రక్తహీనత లేని సమాజ నిర్మాణానికి కృషి


గోడ పత్రికను విడుదల చేసిన వైద్య సిబ్బంది

పాయకరావుపేట: రక్తహీనత లేని సమాజ నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందని శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కావ్య తెలిపారు. మంగళవారం అన్ని గ్రామ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు రక్తహీనత బారినపడకుండా నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 5,186 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం నులిపురుగు నిర్మూలన ప్రచార గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పి.వి. రమణ, వైద్య సిబ్బంది ఎస్.రాజ్యలక్ష్మి, డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వరాహనదికి జలకళ


జల్లూరు శివారున వరాహనదిలోకి చేరుతున్న వరదనీరు

కోటవురట్ల: వరాహకు మళ్లీ జలకళ చేరింది. ఎగువ ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరాహనదిలోకి వరదనీరు చేరుతోంది. పాతరోడ్డు సమీపంలో రెండు నదులు కలియడంతో ఇక్కడ నీటి ప్రవాహం పెరుగుతోంది. పందూరు ప్రాంతంలోని వరాహనదిలో వరదనీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది. వరాహనదిలోకి జలకళ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

14, 15 తేదీల్లో గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ఈ నెల 14, 15 తేదీల్లో మునగపాకలో గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా వార్షికోత్సవంలో భాగంగా నాటిక ప్రదర్శనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే నాటిక ప్రదర్శనలకు కళాభిమానులు తరలిరావాలన్నారు. గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవీ సత్యనారాయణ, ఆడారి సూర్య చంద్రరావు, మళ్ల రామజోగినాయుడు, నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కర రావు, ఒంపోలు సర్పంచ్ గంగ్రెడ్డి సూరిబాబు, ఆడారి గణేష్, పాలిపిని రాము పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములిచ్చేది లేదు

కలెక్టర్, ఆర్డీవోలకు రైతుల వినతి


బల్క్ డ్రగ్‌కు భూములిచ్చేది లేదంటూ ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ వారు ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పరిశ్రమలకు భూములిచ్చేది లేదని సీహెచ్‌ఎల్‌పురం, జానకయ్యపేట, పెదతీనార్ల గ్రామాల రైతులు స్పష్టం చేశారు. సోమవారం వీరంతా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం నాయకుడు ఎం అప్పలరాజుల ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఫేజ్ 2 కోసం అదనంగా 700 ఎకరాలు భూములు సేకరించేందుకు ప్రభుత్వం 6ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు నిరసన తెలిపారు. నర్సింహమూర్తి, అప్పలరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలంతా భూములనే నమ్ముకుని జీవిస్తున్నారరన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించిన రైతుల అభిప్రాయాలు, ఆందోళనల వీడియో క్లిప్పింగ్‌లు తారుమారు చేయకుండా యథావిధిగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. నూటికి 95 శాతం మంది వ్యతిరేకించారన్నారు. ప్రాణాలిచ్చయినా భూములను కాపాడుకుంటామని, ప్రభుత్వం విడుదల చేసిన 6ఏ నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు. పచ్చటి పొలాలను ప్రమాదకర రసాయన పరిశ్రమల కోసం తీసుకుని ఈ ప్రాంతాలను కలుషితం చేయొద్దని కోరారు.

ఆపరేషన్ థియేటరా? డైనింగ్ హాలా?

రేగుపాలెం పీహెచ్‌సీ ఓటీలో సిబ్బంది భోజనాలు


ఆపరేషన్ థియేటర్‌లో సోమవారం మధ్యాహ్నం భోజనాలు చేస్తున్న సిబ్బంది


రేగుపాలెం పీహెచ్‌సీ శస్త్ర చికిత్సలు చేసే టేబుల్‌పై ఉంచిన ఆహార పదార్థాలు

యలమంచిలి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, తెలిసినా ఏం చేస్తారులే అన్న ధీమా వెరసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ఆపరేషన్ థియేటర్‌ను అక్కడ సిబ్బంది ఏకంగా డైనింగ్ హాల్‌గా మార్చేశారు. రోజూ ఈ ఆస్పత్రి ఓటీలో సిబ్బంది దర్జాగా మధ్యాహ్న భోజనాలు చేయడానికి వినియోగిస్తున్నారు. ఓటీలో ఏసీ వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తున్నా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసే గదుల నిర్వహణ ప్రత్యేకంగా ఉంటుంది. క్రిమిరహితంగా ఉండేలా రోజూ ప్రత్యేకమైన పద్ధతుల్లో ఓటీని శుభ్రపరచాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సిబ్బంది భోజనాలు చేయడానికి వినియోగిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు ఉన్న శస్త్రచికిత్సలు చేసే గదులు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో సాధారణ గదుల్లా మారుతున్నాయి. గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకున్న వారిలో ఇద్దరికి ఇన్‌ఫెక్షన్ సోకిన సందర్భాలున్నాయి. అయినప్పటికీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిలో మార్పు రాకపోవడానికి ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు సుగుణను సంప్రదించగా గదులు చాలకపోవడం వల్ల ఓటీలో భోజనాలు చేస్తున్నారన్నారు. రోజూ భోజనాలు చేసిన తర్వాత ఓటీని శుభ్రపరుస్తున్నారన్నారు. రేగుపాలెం పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను డైనింగ్ హాల్‌గా మార్చిన వైనంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

కోటవురట్ల: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితితో కౌలుకు ఇవ్వడానికి ఈ నెల 13న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. పలు గ్రామాల్లో 40.68 ఎకరాల పంట భూములకు సంబంధించి ప్రథమ ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొవాలన్నారు. ఎక్కువ మొత్తానికి పాట పాడుకున్న వారు ఏడాదికి కౌలు సొమ్ము డిపాజిట్‌గా సత్వరమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు


గవర్ల అనకాపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ధర్మశ్రీ


టి.సిరసపల్లిలో మహానేత రాజన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ధర్మశ్రీ, ప్రసాద్

- బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి
- మహానేత రాజన్న ఆశయాలు జగనన్నతోనే సాధ్యం
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ధర్మశ్రీ

మునగపాక: ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమికి చరమగీతం పాడాలన్నారు. మండలంలోని వెంకటాపురం, టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజన్న పాలన జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో అసహనం మొదలైందన్నారు. బూటకపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం సిగ్గుచేటన్నారు. గతంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు వాటిని కోత విధిస్తున్నారన్నారు. ఉపాధి వేతనదారులకు వేతనాలు సకాలంలో అందడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం శరణ్యమన్నారు. దీపం పథకం ధూపంగా మారిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కొందరికే అమలవుతుందన్నారు. తల్లికి వందనంలో పెద్ద ఎత్తున కోత విధించారన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్‌షాపులో దర్శనమిస్తున్నాయన్నారు. ఆడబిడ్డ నిధి ఎపుడు అమలవుతుందో తెలియక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదవి కోసం సొంతమామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు మోసాలను గుర్తించి స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యాయన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. టి.సిరసపల్లి, తోటాడ గ్రామాల్లో మహానేత రాజన్న విగ్రహాలకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్‌లు సుందరపు తాతాజీ, దొడ్డి కోటేశ్వరరావు, దాసరి అప్పారావు, ఇందల నాయుడు, భీశెట్టి గంగప్పలనాయుడు, అయినంపూడి విజయభాస్కరరాజు, కారుకొండ రాజు, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల వెంకటలక్ష్మి, మళ్ల కాశీ సురేష్, ఇల్లా నాగేశ్వరరావు, వెంకటాపురం ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, పార్టీ నేతలు పొలమరశెట్టి నాయుడు అప్పలనాయుడు, దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, నరాలశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు రవీంద్రరాజు, కాండ్రేగుల సూర్యనారాయణ, పొలమరశెట్టి బాలు, పిట్టా మంగారెడ్డి, బొడ్డేడ జగ్గారావు, బొడ్డేడ బుజ్జి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డేడ చెల్లయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ యాక్టుపై అవగాహన

అనకాపల్లి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న తెలిపారు. మండలంలో తుమ్మపాలలో రైతు సాధిక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ యాక్టుపై రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. ఎటువంటి రసాయనాలు లేని పంటలు పండించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు రోజూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ అప్పలరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు


గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు


బోడికొండ దిగువన ఐదెకరాల విస్తీర్ణంలో జెడ్పీ ఉన్నత పాఠశాల

అచ్యుతాపురం రూరల్: మడుతూరులో బోడికొండ సర్వే నంబర్ 285లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారు నుంచి అనధికారంగా ఏర్పాటు చేసిన మూడు క్వారీ లారీలు, ఒక జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టగా అడ్డుకున్నారు. గతంలోనూ ఇదేవిధంగా చేపట్టిన తవ్వకాలపై చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని వాపోయారు. కూటమి నాయకులు అండదండలతో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఇక్కడ కొండను ఆనుకుని ఐదెకరాల విస్తీర్ణంలో జెడ్పీహైస్కూలు ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పాఠశాలతోపాటు దిగువ ప్రాంతాల్లో గ్రామాలకు ముప్పు పొంచే అవకాశం ఉందని వాపోయారు.

ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మండల ఎండీఎం కార్మిక సంఘం అధ్యక్షులు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికు లు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో 18 ఏళ్లుగా 8 మంది కార్మికులు వంట పని చేస్తున్నప్పటికీ వారిలో నలుగురికి మాత్రమే నెలకు రూ.3 వేలు చొప్పున వేతనం అందిస్తున్నారని పేర్కొన్నా రు. ఆ నలుగురికి వచ్చిన వేతనాన్ని 8 మంది పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి జిల్లాలో అనేక పాఠశాలల్లో జరుగుతోందన్నారు. బయట కూలి పనులకు వెళితే ఒక్కొక్కరికి రోజుకి రూ.600 చెల్లిస్తున్నారని, పాఠశాలల్లో వంట పని వారి ఇబ్బందులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు బియ్యం, గుడ్లను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుందని, మిగిలిన వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు యూనిఫారం, ఐడెంటిటీ కార్డు, ఆస్పత్రి సదుపాయం కల్పించాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు.